పెగడపల్లి-వెంగళాయిపేట రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

ఆహ్లాదం పంచుతున్న 'హరిత' చెట్లు

పెగడపల్లి-వెంగళాయిపేట రోడ్డుకు ఇరువైపులా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమం రెండో విడుతలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించారు. అవి వృక్షాలుగా మారి రోడ్డుపై వెళ్తున్న ప్రయాణికులకు నీడ ఇవ్వడంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. -పెగడపల్లి, డిసెంబర్ 1

వైద్య శిబిరానికి విశేష స్పందన

మహిళ ను పరీక్షించి, మందులు రాస్తున్న వైద్యులు

కోరుట్ల, డిసెంబర్ 1: పట్టణంలోని సీ ప్రభాకర్ భవనంలో ఆదివారం స్వేచ్ఛ సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో సురేఖ నర్సింగ్ హోమ్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. వైద్య శిబిరాన్ని సీఐ సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దవాఖాన వైద్యులు సోమేశ్వర్, శ్రీకాంత్, సాయి నవ్య సుమారు 200 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో స్వేచ్ఛ సాహిత్య సేవా సమితి అధ్యక్షుడు రాస భూమయ్య, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సారంగాపూర్: సినీ నటుడు శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మేడిపల్లి: వేదికపై గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

సారంగాపూర్, డిసెంబర్ 1: మండలంలోని పెంబట్ల-కోనాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1995-96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సినీ నటుడు శ్రీకాంత్ హాజరయ్యారు. కాగా, శ్రీకాంత్‌ను శాలువాతో సత్కరించారు. అలాగే, పూర్వ విద్యార్థులంతా ఒక చోట కలిసి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి, డిసెంబర్ 1: భీమారం మండలం వెంకట్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆటపాటలతో రోజంతా ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి, శాలువాలతో సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల, డిసెంబర్ 1: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని 7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తనను గెలిపించిన ప్రజలకు అభివృద్ధి పనులు చేపట్టి రుణం తీర్చుకుంటానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు రేణుక-మొగిలి, ప్రేమలత-సత్యం, కో-ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, పాల్గొన్నారు.

సర్కారు హామీలను నెరవేర్చాలి

కోరుట్ల, డిసెంబర్ 1: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. పట్టణానికి చెందిన తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ ఇటీవల ప్రమాదంలో గాయపడగా ఆదివారం ఆయనను పరామర్శించారు. ఈసందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు గంగారెడ్డి, షాహేద్ మహ్మద్ షేక్, శనిగరపు రాజేశ్, అజయ్, గణేశ్, రాహుల్ తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఐఎంఏ సభ్యులు

జగిత్యాల, డిసెంబర్ 1: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జగిత్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి-లక్ష్మణ్, డీఎంహెచ్‌వో ప్రమోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి సుధీర్, జైపాల్, వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, ఆశ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కథలాపూర్, డిసెంబర్ 1: మండల కేంద్రంలో కోరుట్లకు చెందిన రెనే దవాఖాన ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 250 మందికి వివిధ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఎండీ సమీర్, దవాఖాన ప్రతినిధులు అరవింద్, బత్తిని అనుదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కుష్టు బాధితుల గుర్తింపు సర్వే

జగిత్యాల, డిసెంబర్ 1: జిల్లాలో సోమవారం నుంచి కుష్టు బాధితుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆదివారం ఆయన ప్రోగ్రాం ఆఫీసర్ (ఎయిడ్స్, లెప్రసీ) డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్‌కుమార్ మాట్లాడారు. సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని పేర్కొన్నారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సర్వే చేయాలని ఆదేశించారు. సర్వేకు వచ్చే బృందాలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, హెల్త్ ఎడ్యుకేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పీడీ

జగిత్యాల, డిసెంబర్ 1: శాతవాహన విశ్వవిద్యాలయం (కరీంనగర్) ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వవిద్యాలయ మహిళల అంతర్ కళాశాలల పోటీల్లో జగిత్యాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ గునుక శ్రీలత తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు పీడీ లావుడ్యా హరిరాంను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ గువ్వ అమృత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

ఎయిడ్స్ దినోత్సవం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్, డిసెంబర్ 1: మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద సైకాలజిస్టు రాజరత్నాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ పై అవగాహన కరపత్రాలను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సిరిపురం రవీందర్, ముద్దం సత్యనారాయణ, పెరుమాండ్ల రాజేందర్, రుద్ర రాంప్రసాద్, లక్ష్మణ్, సురేశ్, నర్సారెడ్డి, లక్ష్మీరాజం, ఆనంద్, శ్రీనివాస్, నర్సయ్య, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

షుగర్ నిర్ధారణ పరీక్షలు

వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపు కోదండ రామాలయం ఆవరణలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు ఆదివారం ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్‌తో బాధపడుతున్న వారికి పాటించాల్సిన ఆహారపు అలవాట్లను వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో జగిత్యాల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తాటిపాముల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, కోశాధికారి గుండేటి గంగాధర్, చార్టర్ ప్రెసిడెంట్ శ్రీరాముల సుదర్శన్, ఉపాధ్యక్షుడు ఐల్నేని వెంకటేశ్వరరావు, మానపురి శ్రీనివాస్, కట్ల శ్రీనివాస్, తంగెళ్ల రమేశ్, గాలిపెల్లి నర్సయ్య, సామల శ్రీహరి, కాసారపు లక్ష్మీనారాయణ గౌడ్, లయన్స్‌క్లబ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీటీ కార్యవర్గం

ఆర్‌యూపీపీటీ నూతన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల టౌన్, డిసెంబర్ 1: పట్టణంలోని గీతా విద్యాలయంలో ఆర్‌యూపీపీటీ జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా, సహాధ్యక్షుడు నాగుల బిక్షపతి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కట్కం నరేందర్, ఉపాధ్యక్షులుగా జయలలిత, ఎండీ హమీదుల్లా, ఎన్ గంగన్న, శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా చంద సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులుగా ఎస్ సుగుణాకర్, ఎండీ ముజకీర్‌పాషా ఎన్నికయ్యారు.

ఎల్‌పీజీ లబ్ధిదారులకు వంటల పోటీలు

జగిత్యాల, డిసెంబర్ 1: జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఎల్‌పీజీ లబ్ధిదారులకు సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్ కింద ఆదివారం వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జ్యోతిర్మయి, శృతి మొదటి స్థానం, లహరి, మమత రెండో స్థానం, దివ్య, ప్రతిభ మూడో స్థానంలో నిలిచారు. న్యాయ నిర్ణేతలుగా జమునరాణి, డాక్టర్ రజిత, డాక్టర్ గీతిక, ఐవోసీ జిల్లా గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

జగిత్యాల రూరల్, డిసెంబర్ 1: పట్టణంలోని కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఈనెల 3న ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు సంజయ్ కల్వకుంట్ల, డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, ఎల్ రమణ, కలెక్టర్ సత్యప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని దివ్యాంగుల సంఘాల సభ్యులు, దివ్యాంగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీనర్సింహ స్వామి ఆదాయం రూ.3.18 లక్షలు

ధర్మపురి, డిసెంబర్ 1: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఆదివారం రూ.3,18,829 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సెలవు దినంతో పాటు కార్తీక అమావాస్య సందర్భంగా ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. టికెట్ల ద్వారా రూ.1,31,717, ప్రసాదాల ద్వారా రూ.1,25,380, అన్నదానం ద్వారా రూ. 61,732 ఆదాయం సమకూరినట్లు వివరించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కోరుట్ల, డిసెంబర్ 1: పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. పనులను మున్సిపల్ కమిషనర్ తిరుపతి పరిశీలించారు. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇక్కడ మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 1: లక్ష్మీపూర్‌కు చెందిన నలివాల భగత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శించారు. అలాగే, జాబితాపూర్‌కు చెందిన అణుపురం రవి గౌడ్ తండ్రి రాజన్న మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ పరామర్శ

జగిత్యాల రూరల్, డిసెంబర్ 1: మండలంలోని పొలాస గ్రామానికి చెందిన సులోచన, కుటుంబ సభ్యులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆదివారం జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేశ్ పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నాయకులు, తదితరులున్నారు.

గొల్లపల్లిలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రశంసా పత్రాలతో క్రీడాకారులు

గొల్లపల్లి, డిసెంబర్ 1: మండల కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలను ఆదివారం ప్రారంభించారు. కబడ్డీలో రాపల్లి జట్టు ప్రథమ, దట్నూర్ జట్టు ద్వితీయ, దక్కించుకున్నాయి, వాలీబాల్‌లో గొల్లపల్లి జట్టు ప్రథమ, మల్లన్నపేట జట్టు ద్వితీయ స్థానం, పరుగు పందెంలో మనోహర్, మన్మోహన్, సాయి విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కట్ట మహేశ్, చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ భూమేశ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల మహిపాల్, క్రీడాకారులు మండల జగన్, రాజసింహా రావు, శేఖర్, రవితేజ పాల్గొన్నారు.

కంకలమ్మ దేవీ జాతర

కథలాపూర్, డిసెంబర్ 1: అంబారిపేట గ్రామంలో మేదరి సంఘం ఆధ్వర్యంలో కేతేశ్వరస్వామి కంకలమ్మ దేవి జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

3,34,227 కుటుంబాల్లో సర్వే పూర్తి

కలెక్టరేట్, డిసెంబర్ 1: జిల్లాలో ఇప్పటి వరకు 3,34,227 కుటుంబాల్లో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ తెలిపారు. పట్టణాల్లో 1,21,320 కుటుంబాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 2,12,957 కుటుంబాల్లో ఇప్పటి వరకు సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. సర్వే తీరుతెన్నులను కలెక్టర్ పమేలా సత్పతి నిత్యం పర్యవేక్షిస్తుండగా, మున్సిపల్ పరిధిలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వివరాలు కూడా సర్వేలో భాగంగా సేకరించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. గ్రామాలు, వార్డుల్లో సేకరించిన వివరాలను మున్సిపల్, మండల కేంద్రాల్లోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారని, సర్వే సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు అదనపు కలెక్టర్ తన ప్రకటనలో వెల్లడించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లల్లో సర్వే

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఇళ్లల్లో ఆదివారం ఎన్యుమరేటర్లు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ నివాసాలకు వెళ్లిన ఎన్యుమరేటర్లు వారి నుంచి వివరాలు సేకరించి, సర్వే ఫారాల్లో నమోదు చేశారు.

రేకుర్తి కంటి దవాఖాన సేవలు భేష్

విద్యానగర్, డిసెంబర్ 1 : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ నడిపల్లి వెంకటేశ్వర్ రావు ఆదివారం రేకుర్తి కంటి దవాఖానను సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలోని పలు విభాగాలను సందర్శించి, నిర్వహణ తీరును అభినందించారు. దవాఖాన శుభ్రతను మెచ్చుకున్నారు. హాస్పిటల్ అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

మాలల సింహగర్జన సభకు తరలిన నాయకులు

వెల్గటూర్: హైదరాబాద్‌కు తరలివెళ్తున్న వెల్గటూర్, ఎండపల్లి మండలాల మాల సంఘం నాయకులు

మెట్‌పల్లి/జగిత్యాల రూరల్/కోరుట్ల/మేడిపల్లి/కథలాపూర్/వెల్గటూర్, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన సభకు జిల్లా నుంచి మాల కులస్తులు వాహనాల్లో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో జాక్ చైర్మన్ నకుమల్ల లక్ష్మీనారాయణ, నాయకులు విజయ్‌కుమార్, మద్దెల నారాయణ, కారంగుల వసంతరావు, కొడిపెల్లి నరేశ్, గోవర్ధన్, కొప్పుల వెంకటరమణ, సాల్మన్ సుధాకర్, అశోక్, శ్యామ్, రాణి, కళ్యాణి, నరేందర్, అంజన్న, కమలాకర్, మహేశ్, తదితరులున్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ఇంద్రానగర్ నుంచి మాల సంఘం సభ్యులు, కోరుట్ల పట్టణం నుంచి నాయకులు రాజారెడ్డి, నర్సయ్య, రాజనర్సయ్య, శోభన్, మురళి, రాజేందర్, నారాయణ, మేడిపల్లి, భీమారం మండలాల నుంచి మాజీ జడ్పీటీసీ నెల్లుట్ల పూర్ణిమ, ప్రభాకర్, మాల సంఘం సభ్యులు, కథలాపూర్ మండలం నుంచి మాల సంఘం సభ్యులు, వెల్గటూర్, ఎండపల్లి మండలాల నుంచి రెడ్డిమల్ల తిరుపతి, గంగయ్య, గంగాధర్, లక్ష్మణ్, ప్రభాకర్, నర్సయ్య, ఎల్లయ్య, సతీశ్, తిరుపతి, తరల్ల తిరుపతి, కిరణ్, శ్రీనివాస్, నల్లగొండయ్య, లచ్చయ్య, రాజేశ్ తదితరులున్నారు.

యాదవ సంఘాన్ని బలోపేతం చేస్తాం

మాట్లాడుతున్న యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్

సారంగాపూర్, డిసెంబర్ 1: జిల్లాలో యాదవ సంఘాన్ని బలోపేతం చేస్తామని యాదవ సంఘం అడహక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ యాదవ్ పేర్కొన్నారు. బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామంలో ఆదివారం ఆయన యాదవులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గనవేని మల్లేశ్ యాదవ్ మాట్లాడుతూ, యాదవుల హక్కులను సాధించుకుంటామన్నారు. జిల్లా ముఖ్య సలహాదారు కొల్ముల రమణ మాట్లాడుతూ, యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో యాదవుల సమస్యలు, హక్కులు, తదితర అంశాలపై చర్చించారు. అనంతరం యాదవ సంఘం సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సలహాదారు రెబ్బిస్ మల్లన్న, యాదవ సంఘం అడహక్ కమిటీ మండల ఇన్‌చార్జులు వూరడి కొమురెల్లి, బానుక శంకర్, చల్ల లక్ష్మణ్, బండ మల్లేశ్, మాదం మల్లేశ్, యాదవ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియం కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 1: పట్టణంలో మినీ స్టేడియం కోసం ప్రభుత్వాన్ని, ఇక్కడి కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్రీడాకారులకు సూచించారు. ఒక క్రీడాకారుడిగా తాను, హుజూరాబాద్‌లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ, కాంగ్రెస్ అడ్డుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీల ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదైనా కోపం ఉంటే తనమీద తీర్చుకోవాలి తప్ప, క్రీడాకారులపై కాదన్నారు. పట్టణంలో మినీ స్టేడియం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి రూ.పది కోట్లు తీసుకువచ్చానని స్పష్టం చేశారు. ఏప్రిల్ 28, 2023లో స్పోర్ట్స్ గ్రౌండ్‌కు 10 కోట్ల రూపాయల టెండర్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మినీ స్టేడియం కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మినీ స్టేడియం కోసం తాను 10 కోట్ల రూపాయలు తీసుకువస్తే, కొంతమంది జోకర్లు మైదానం అభివృద్ధి కోసం కేవలం రూ. 10 లక్షలు తెచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. హుజూరాబాద్‌లో అద్భుతమైన గ్రౌండ్ ఏర్పాటు చేయాలని తాను కన్న కలలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని విచారం వ్యక్తంచేశారు. ప్రతి క్రీడాకారుడికి, అన్నా అంటే నేనున్నానని స్పందిస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో కూడా హైడ్రా పేరుతో ప్రతాపవాడ, కిందివాడకు సంబంధించి పరిశీలన జరిగినట్లు తెలుస్తున్నదని, ఏదైనా పేదవాడి ఇంటిని కూలగొట్టాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. హైడ్రా పేరుతో పేదవాడి ఇంటికి వచ్చి బెదిరిస్తే, తనకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఏ రాత్రి అయినా సరే వచ్చి మీతోనే ఉంటానని హామీ ఇచ్చారు. తనమీద కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపం ఉంటే జైల్లో పెట్టిన పర్వాలేదని, పేదవాడి జోలికి వస్తే మాత్రం ఊరుకోనని హెచ్చరించారు.

సంఘాలు-కార్యవర్గం

రాయికల్, డిసెంబర్ 1: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో మార్కండేయ పద్మశాలీ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోర గణేశ్, ఉపాధ్యక్షుడిగా నామని శేఖర్, ప్రధాన కార్యదర్శిగా మోర శివ, కోశాధికారిగా నామని లక్ష్మీనర్సయ్య, సంయుక్త కార్యదర్శిగా స్వర్గం శ్రీనివాస్, సలహాదారులుగా మోర వెంకటేశ్, బాలె శేఖర్, బోగ నర్సయ్య, వేముల సతీశ్, మిట్టపల్లి దామోదర్, బొమ్మకంటి సురేశ్ ఎన్నికయ్యారు. అలాగే, భూపతిపూర్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీపాద నిఖిల్ చారి, ఉపాధ్యక్షుడిగా తొగిటి సంతోష్, క్యాషియర్‌గా తుమ్మనపెల్లి విజయ ఎన్నికయ్యారు.

మల్లాపూర్, డిసెంబర్ 1: మండల కేంద్రంలో జామా మసీద్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడిగా షేక్ పాషా, ప్రధాన కార్యదర్శిగా షేక్ చాంద్, కోశాధికారిగా ఎండీ అప్సర్, కార్యదర్శిగా షేక్ రఫీ, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ధర్మపురిలో ఎస్‌యూ వీసీ పూజలు

ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్ దంపతులను సన్మానించి, స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో శ్రీనివాస్

ధర్మపురి, డిసెంబర్ 1: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్‌కుమార్ కుటుంబసమేతంగా పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న వీసీకి దేవస్థానం సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల